# పాపాయి యఃల్లు

ఊరికి దూరంగావుంది ఆ గుడిసె. విపరీతమైన వర్షం: విపరీతమైన గాలి. గాలికి చెట్లు కూలుతున్నై, ఉరుములు ఉరుముతున్నై మెరుపులు మెరుస్తున్నై.

ఆ గుడిసెలో తాత విచారంగా కూర్చుని వున్నాడు. ఉరుములు ఉరిమినప్పుడల్లా ఉలిక్కిపడుతున్నాడు. మెరుపులు మెరిసినప్పుడల్లా, కళ్ళు మూసుకుంటున్నాడు. పాప మాత్రం కాళ్ళసందున నిలబడి నంగి నంగి మాటలు చెబుతూవుంది....

"అతూ యితూ వెల్తానంతుంది. ఎప్పులూ తిలుగుతుంది. పక్క వాళ్ళింతికి వెల్తుంది. ఎదులు వాళ్ళింతికి వెల్తుంది. ఎదులు వాళ్ళగోత్లో వేలు పెత్తి కోతుకుంతుంది"

తాతకు భయంవేసింది. నెమ్మదిగా పాప తల నిమురుతూ "ఎవరమ్మా" అన్నాడు.

"పాప" అంది పాప.

"ఎవరి పాప?"

"మా పాపే"

గలి యెక్కువయింది, పసిపిల్లలు వందమంది కలిసి ఏడుస్తూ వున్నట్లుగా వినిపిస్తూంది. ఫెళఫెళామని గర్జించినై ఉరుములు. తాతకు భయం ఎక్కువయింది. పాపని దగ్గరకు తీసుకున్నాడు. మెరుపులకాంతిలో పాపని తనివితీరా చూట్టానికి ప్రయత్నించాడు. పాపమాత్రం మాట్లాడుతూనేవుంది.

"మా పాప మంచిది. గిన్నెలు పగలగొట్టదు. ఎత్తుకోమని ఏలవదు. ఎప్పులూ ఆలుకుంతుంది...."

ధన్ ధన్ ధన్ మని బయటమోత. తాతగుండెలు అవిసినై. వొణికిపోయాడు. ఆ గాలి, ఆ వర్షం, ఆ ఉరుములు, ఆ మెరుపులు అన్నీ ఏకమై తనమీదకు దండెత్తుతున్నై. ఏం చెయ్యటానికి–తాత గుండె బేజారయింది.

పాపమాత్రం యధాప్రకారం మాట్లాడుతూనేవుంది, మాట్లాడుతూ, మాట్లాడుతూ అకస్మాత్తుగా, "తాతా! మా ఇంతి కొత్తావా?" అంది.

తాత గుండె గుభేలుమన్నది. పాప తల నిమురుతూ వున్న చెయ్యి వొణికింది. కళ్ళ వెంట నీళ్ళుకారాయి.... "అమ్మా. అమ్మా, నీ ఇల్లెక్కడమ్మా" అని అడిగాడు.

"అక్కడుంది" అని కిటికీవైపుకి చూపింది.

తాత ఇక మాట్లాడలేకపోయాడు. ఆలోచనలు చెలరేగినై. ఆకాశంవైపుకిచూశాడు. ఒక నిట్టూర్పు విడిచాడు. పాప మాత్రం మాట్లాడుతూనేవుంది.

"మా ఇంట్లో నాన్నున్నాలు. అమ్మంది. ముందు మా పాప చక్కా తాగుతుంది...."

వెంటనే తాత కొక కోర్కె కలిగింది. పాప నడిగాడు.

"తాతున్నాడా?"

"లేలు– తాత ముసలాలు" అని జవాబు చెప్పింది పాప.

తాత ఇక మాట్లాడొద్దనుకున్నాడు. ముసగదీసుకొని, కుంచుక్కూంచుక్కూచున్నాడు పాప మాత్రం యధాప్రకారం మాట్లాడుతూనే వుంది.

"మా ఇంట్లో అన్నీ ఉన్నై. మా పాపే అన్నం తిన్నని గోల చేత్తుంది. బళ్ళో కెళ్ళదు. పలక కావాలంతుంది. 'అన్నంవొద్దే' అని

ఏలుత్తుంది. కొనుక్కుంతానికి చిన్నకానీ ఇమ్మంతుంది మా ఇంట్లో లైత్తు కూలా వున్నై."

గాలికి కిటికీ తలుపులు టపాటపా కొట్టుకొని, వందమంది పసి పిల్లల ఏడుపునీ ముంచివేసింది. చలిగాలి రొపలికి జంయిన కొట్టింది. కోడి పిల్లని రెక్కకిందకు తీసుకున్నట్లు, తాత పాపని శాలువాలోకి తీసుకున్నాడు పాప బుల్లిచేత్తో తాత మొహం తడుపుతూ అడిగింది.

"తాతా, కాదూ?"

"ఏమిటి తల్లీ!"

"పాప ఇల్లు మంచిది కాదూ!"

మంచిదే తల్లీ"

"నువ్వు మంచిదానవు కావూ?"

తాత మాట్లాడలేకపోయాడు. గొంతులో మాటలు గొంతులోనే గురుగురుమన్నై. అవయవాలు బిగిసిపోతున్నై పాపమాత్రం మాట్లాడుతూనే వుంది.

"పాప ఇంట్లో మంచాలున్నాయి తాతా! నే పలుకుంతాను నిద్ర పోతాను."

తాతకి గాలివాన మోత వినబడలేదు. గాలి వాన సంగతే క్షణం మరచిపోయాడు. అంతా పాపే-పాపే-! పాపని హృదయానికి హత్తు కున్నాడు. పాప తలమీద కన్నీటిబొట్లు రాలిస్తేచాలు.

పాప ఉన్నట్లుండి అడిగింది. నేవెళ్ళనా తాతా?"

తాత అలాగే ఉండిపోయాడు. శరీరం కొయ్యబారినట్లు అయి పోయింది. బయటవందమంది పసిపిల్లల ఏడ్పులు ఎక్కువైనై. గుడిసె కదిలిపోయింది. చీకటి మడ్డి కట్టింది.

తాత అడిగాడు. "ఎక్కడికి తల్లీ?"

"మా ఇంతికి."

"నేను వస్తానమ్మా"

"వొద్దు. వాళ్ళే, నిన్ను చూచి నవ్వుతాలు... నవ్వుతాలు తాతా!"

"ఎందుకని తల్లీ?" పగిలిన తాత హృదయంలో నుంచి ఉరుములా బయటపడింది ప్రశ్న....

"ఎందుకని తల్లీ!"

"ఎందుకని తల్లీ!!"

"ఎందుకని తల్లీ!?!"

పాప జవాబు చెప్పలేదు. బయట మెరుపులు మెరిసినై. ఉరుములు ఉరిమినై. చెట్లు ఫెళఫెళా విరిగినై. ధన ధనా కూలినై. గుడిసె అటువూగి ఇటువూగి ఫటఫటా కూలింది. అంతలో నిశ్శబ్దం. అంతలో మోత. తాత తెప్పరిల్లి, లేచి చూచేటప్పటికి పాప దగ్గర్లేదు. తాత గుండెలు పేలిపోయినై. చలి సంబంధం లేకుండానే కాళ్ళు గజగజలాడినై. హృదయంలో, వూడి కుప్పగా బడుతున్న మరమేకుల మోత!

"పాపా, పాపా!" అని, ఆ చీకటికి చేత్తో వెతుకుతూ కేకలు పెట్టాడు.

"పాపా, పాపా!"

గాలివాన మోతే మోత!

"పాపా, పాపా?"

వందా ఒక్క పసిపిల్లల ఏడుపుల ధ్వనే ధ్వని !!